క్లుప్తంగా

పేటలో రెండు నామినేషన్లు దాఖలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల రెండోరోజైన శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కర్నాటి అప్పారావు తన నామినేషన్‌ను దాఖలు చేయగా, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీరాం రాజగోపాల్ తరపున కొత్తమాజు మల్లికార్జునరావు నామినేషన్ దాఖలు చేసినట్లు జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం ఏడు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ వివరించారు. ఏఆర్‌వో పేట తహసీల్దార్ జి.శేషగిరి, ఎలక్షన్ సిబ్బంది శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

రెండోరోజు నామినేషన్లు నిల్..

నందిగామ: నామినేషన్ల రెండోరోజైన శుక్రవారం నందిగామ నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం శనివారం కొనసాగుతుందని, ఉదయ 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు తెలిపారు.

వాహనాల విస్తృత తనిఖీ

వీరులపాడు: అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదని నందిగామ రూరల్ సీఐ పి.చంద్రశేఖర్ హెచ్చరించారు. పెద్దాపురం సమీపంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి వచ్చే ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే రాష్ట్రంలోని అనుమతిస్తున్నట్లు చెప్పారు. అక్రమంగా నగదు, మద్యం, బంగారం రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

17 మంది వలంటీర్లు రాజీనామా

నందిగామ: పట్టణంలోని పలు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ హేమమాలినికి శుక్రవారం అందజేశారు. పట్టణంలోని తొమ్మిదో సచివాలయానికి చెందిన 11మంది, ఐదో సచివాలయానికి చెందిన ఆరుగురు వలంటీర్లు కలిపి మొత్తం 17 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

ఆంధ్రనాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆంధ్రనాట్య ప్రదర్శన జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన రాయన శ్రీనివాసరావు శిష్య బృందం ఆంధ్ర నాట్యాన్ని ప్రదర్శించింది. చిన్నారులు నవ్య, శ్రావణి, తిలోత్తమ, లీలలాస్య, హేమ, అపర్ణ, లక్ష్మీ చైత్ర, మీనాక్షి, పియూష, జశ్విత, మధులిక పలు అంశాలపై చక్కటి హావభావాలతో నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం దర్శనం పూర్తి చేసుకుని ఆరు బయటకు చేరుకున్న భక్తులు వేదికపై ప్రదర్శిస్తున్న ఆంధ్ర నాట్యాన్ని వీక్షించి ముగ్ధులయ్యారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఏఈవో చంద్రశేఖర్ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: స్వరాంజలి సంగీత, సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వరహేల కార్యక్రమం ఆద్యంతం మధురంగా సాగింది. వ్యవస్థాపక సభ్యురాలు వడ్డాది కామేశ్వరి ఆధ్వర్యంలో గాయనీమణులు గోళ్ల విజయశ్రీ గుప్తా, ఆకుల నూకరత్నం, మండవ లక్ష్మీదాస్, సీతంరాజు మాధవి, మల్లాది శిరీష, గొర్తి లలిత, కొత్త రమణి భక్తిగీతాలు, లలిత గీతాలతో పాటు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కామేశ్వరి మాట్లాడుతూ.. నగరంలో మహిళలే నిర్వాహకులుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లోని మహిళలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

ఆటోనగర్(విజయవాడతూర్పు): శ్రీరామనవమి సందర్భంగా స్థానిక 15వ డివిజన్ లోని వీఎంఆర్ రోడ్డులో శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామికి పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వీఎంఆర్ రోడ్డు శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో మరో మూడు రోజుల పాటు శ్రీరామ నవమి వేడుకలను నిర్వహిస్తామని కమిటీ పెద్దలు చెప్పారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



నూరుద్దీన్‌ను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి జగనన్న పాలనకు ప్రభావితులై ఎంతోమంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. తొర్రగుంటపాలెంకు చెందిన టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ నూరుద్దీన్, చిల్లకల్లు గ్రామానికి చెందిన పసుపులేటి రాజేష్, జగ్గయ్యపేటలోని 16వ వార్డు చెరువు బజారుకు చెందిన తాళ్లూరి నాగరాజు, బత్తుల జ్వాలా నరసింహారావు, తాళ్లూరి వెంకట్రావు, తురకా నరసింహారావు, కొండా నాగరాజు, బత్తుల వెంకటనర్సయ్య, మిట్టగూడెంకు చెందిన సకినాల శ్రీనివాస్ తదితరులు టీడీపీని వీడి శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సంక్షేమ విప్లవంతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు.

నూరుద్దీన్ మాట్లాడుతూ టీడీపీలో ముస్లింలకు సరైన స్థానాన్ని కల్పించడం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉదయభాను ముస్లింలకు అత్యధిక ప్రాధాన్యమిస్తుండటంతో వైఎస్సార్ సీపీలో చేరినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సామినేని రవిచంద్, పాటి సాంబ, స్టీల్ ప్లాంట్ సుబ్బారావు, మామిళ్లపల్లి శ్రీను, రాయల అంజయ్య, పార్టీ నాయకులు తన్నీరు నాగేంద్ర, తాళ్లూరి నాగేశ్వరరావు, వేముల విజయ్, వేముల స్వామి, తాళ్లూరి వెంకటేశ్వర్లు, వేముల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో 20 కుటుంబాలు చేరిక

నందిగామ టౌన్: చందర్లపాడు మండలం కొడవటికల్లు, కాసరబాద గ్రామాలకు చెందిన టీడీపీ, బీజేపీ నాయకులు ఆ పార్టీలను వీడి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ అరుణకుమార్ స్థానిక వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో బీజేపీ డివిజన్ దళిత మోర్చా నాయకులు



పార్టీలో చేరిన వారితో సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

కోట సాంబశివరావు, చావల శ్రీనివాసరావు, బుల్లిబాబులతోపాటు పార్టీలో చేరిన 20కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ పొత్తుల పేరుతో అన్నిపార్టీలు కలిసి వస్తున్నా ప్రజలు మాత్రం వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శివాజీ, శిఖా సురేష్, వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగామ ప్రజలకు మంచి చేశా





అనాసాగరం ఎస్సీకాలనీ, గీతామందిరం రోడ్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నియోజకవర్గ ప్రజలకు మంచి చేయాలనే తపనతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చామని, ఈ ఐదేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ఆదిశగా పనిచేశానని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. నందిగామలోని గీతామందిరం రోడ్డు, అనాసాగరం ఎస్సీకాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల ఇళ్లవద్దకు వెళ్లిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు మహిళలు హారతిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం..

ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజల మనసు గెలుచుకునేలా నా ఐదేళ్ల పాలన సాగించానని భావిస్తున్నట్లు చెప్పారు. అనాసాగరంలో ఎన్నో ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించానన్నారు. దశాబ్దాల నాటి మంచినీటి పైప్‌లైన్లు లీకేజీ కారణంగా ప్రజలు ఇబ్బందిపడినా గత పాలకులు పట్టించుకోలేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పైపులైన్‌ను మార్చినట్లు తెలిపారు. వార్డు అభివృద్ధికి సైతం ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ ఐదేళ్లలో నేను ఏదిచేసినా..అది పూర్తిగా ప్రజల సహకారంతోనే సాధ్యమైందన్నారు. నందిగామ శాసనసభ్యునిగా తాను ప్రజలకు మంచి చేశానని మనస్ఫూర్తిగా భావిస్తే, మరోసారి అండగా నిలిచి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వార్డు కన్వీనర్ కోలేటి సుబ్బారావు, నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, గుడివాడ సాంబశివరావు, పాములపాటి రమేష్, వడ్డెల్లి శ్రీను, షేక్ ఫాతిమా, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, షేక్ సుభాని, షేక్ కరిముల్లా, షేక్ యాకుబ్ అలీ, కరి రవీంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాలకు పోయి ఇబ్బందిపడొద్దు : ఏసీపీ

నందిగామ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరూ స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. నందిగామ మండలం అడవిరావులపాడు, చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ల గ్రామాల్లో శుక్రవారం రాత్రి ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ ప్రజలలో ధైర్యాన్ని నింపేందుకే డివిజన్ పరిధిలోని ప్రతిగ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అనవసర వివాదాల్లో తలదూర్చి ఇబ్బందులు తెచ్చుకోవద్దని ప్రజలకు సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేందుకు అందరూ సహకరించాలని కోరారు. అవగాహన సదస్సుల్లో నందిగామ పట్టణ ఇన్‌స్పెక్టర్ హనీష్, రూరల్ సీఐ పి.చంద్రశేఖర్, నందిగామ, చందర్లపాడు ఎస్సైలు పండు దొర, ధర్మరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

తిరుమలగిరి(జగ్గయ్యపేట): సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని చిల్లకల్లు ఎస్సై సతీష్ సూచించారు. మండలంలోని తిరుమలగిరిలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రువారం రాత్రి ఆయన గ్రామంలో శాంతిభద్రతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ ముఖ్యంగా ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఘర్షణలు, అల్లర్లు తలెత్తకుండా అందరూ శాంతియుతంగా ఉండాలన్నారు. ఎన్నికలు శాంతియుతంగా పూర్తయ్యేందుకు అన్ని రాజకీయ పార్టీ నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఈ నెల 22 నుంచి జరిగే వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో



ముప్పాళ్లలో మాట్లాడుతున్న ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాంబాబు

పార్టీ జెండాలు, డీజేలు నిషేధించినట్లు చెప్పారు. అందరూ ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

పెనుగంచిప్రోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామస్తులకు శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఎన్నికల వేళ గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

24న డాక్టర్ జగన్‌మోహనరావు నామినేషన్

కంచికచర్ల : నందిగామ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు ఈనెల 24వతేదీన తన నామినేషన్ దాఖలు చేస్తారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. కంచికచర్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి 25వేల మందికిపైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరుకానున్నట్లు తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే రోజునే వైఎస్సార్ సీపీ విజయం మరోసారి తథ్యమనేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేశారన్నారు. అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ ఆయా పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందన్నారు. రానున్న కాలంలో జగనన్న మరోసారి సీఎం అయితే ఆయా సంక్షేమ పథకాలు సజావుగా అమలతాయన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించేవారంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ఎమ్మెల్సీ కోరారు. సమావేశంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాధరావు, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్ బాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు బోడపాటి బాబూరావు, కాలవ పెదబాబు, వేల్పుల శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, మంగలపూడి కోటిబాబు, పరిటాల రాము, బొక్కా రవికుమార్, బండారుపల్లి సత్యనారాయణ, లడగపాటి నాగేశ్వరరావు, వెలగలేటి బాబు, మంగిసెట్టి పుల్లారావు, తంగెళ్లమూడి రామారావు, షేక్ రజీం, శేషం మధుబాబు పాల్గొన్నారు.



కంచికచర్లలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

అగ్నిప్రమాదాలపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన





ప్రమాదాల సమయంలో మంటలను అదుపు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కంచికచర్ల: అగ్ని ప్రమాదాల బారినపడకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆస్తినష్టంతోపాటు ప్రాణనష్టం జరగకుండా కాపాడవచ్చని కంచికచర్ల ఫైర్ అధికారి టీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద శుక్రవారం అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. కరపత్రాలను పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట గదిలో గ్యాస్ లీకైతే ముందుగా కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. వేసవికాలంలో వరిగడ్డికి ఆకతాయిలు నిప్పంటించే ప్రమాదం ఉందని పశుపోషకులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బయట వ్యక్తులు ఆప్రాంతంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కె.మధురిమ, ఫైర్ సిబ్బంది బి.శ్రీను, ఎస్‌కే తాజుద్దీన్, బి.సంజీవ్ వర్మ, షేక్ సుభానీ, శ్రీనివాసరావు, జి.రాజశేఖర్, బి. జీవన్, ఎం.అశోక్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా చూసుకోవడం ఎంత ముఖ్యమో...ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలనే అంశంపై అవగాహన కలిగి ఉండటం అంతే ముఖ్యమని నందిగామ ఫైర్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పలు ఆసుపత్రుల్లో సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో మంటలను అదుపు చేసే సిలిండర్లు, నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రమాదాన్ని గమనించిన వెంటనే ఫైర్ సిబ్బందికి తెలియజేయాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ బారినపడకుండా నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలను వినియోగించాలని సూచించారు. ఫైర్‌సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తాం

న్యాయమూర్తి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): అవసరమైన పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య తెలిపారు. విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం (జువెనైల్ హోమ్)ను ఆయన శుక్రవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. పిల్లలతో సంభాషించి వారికి హోమ్‌లో కల్పించే సౌకర్యాలు, సమస్యలు, వారికి కల్పించే లీగల్ సర్వీసెస్ (న్యాయ సలహాలు) గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ చట్టాలపై క్లుప్తంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. బాల్యంలో తెలిసో తెలియకో చేసిన తప్పుల పట్ల పశ్చాతాపపడి పరివర్తన చెందాలని అన్నారు. తద్వారా సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హోమ్ పర్యవేక్షణాధికారి పి.రామమోహన్‌రెడ్డి, బాలల న్యాయ సలహా మండలి సభ్యులు అన్నామణి, ప్యానల్ లాయర్ మహాలక్ష్మి, ప్రొహిబేషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



ముండ్లపాడులో ప్రచారం చేస్తున్న వాసు, రవికుమార్ తదితరులు



జగ్గయ్యపేటలో ప్రచారం నిర్వహిస్తున్న తుమ్మల ప్రభాకర్, నాయకులు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను విజయాన్ని కోరుతూ ఆపార్టీ నాయకులు మండలంలోని ముండ్లపాడులో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, నాయకులు కూచి విష్ణు, చెన్నకేశవులు, పాల్గొన్నారు. అనిగండ్లపాడులో సర్పంచి జ్యోతిబ్రహ్మం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గంగూరి ప్రసాద్, నాయకులు వూట్ల లక్ష్మయ్య, జాన్‌మియా, దోసపాటి దానయ్య, ఉన్నం శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, కొత్తపల్లి పెంటయ్య, ధనకోటేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.సామినేని ఉదయభానును మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మేలు పొందినవారంతా తప్పకుండా వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కోరారు. స్థానిక 1, 6వ వార్డు పరిధిలోని 44వ పోలింగ్‌కేంద్రం పరిధిలో శుక్రవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను గెలుపు కోరుతూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు రానున్న ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరారు. అభివృద్ధి చూసి వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఓటర్లను అభ్యర్థించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల : కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సాధారణ సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ అత్తోట దీప్తి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన నిర్వహించే ఈసమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయాశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయంలో వేసవి తీవ్రత దృష్ట్యా శుక్రవారం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్ ఓబులేష్, విజయవాడకు చెందిన సీహెచ్ సూర్యనారాయణ సౌజన్యంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పాల్గొన్నారు.

కంచికచర్లలో ఇంటింటా ప్రచారం

కంచికచర్ల : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్ మోహనరావును గెలిపించాలని కోరుతూ కంచికచర్ల వసంతకాలనీలో ఆపార్టీ పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు నేతృత్వంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ తొలుత వసంతకాలనీలోని నాగలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వసంతకాలనీలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఆయా పథకాల ద్వారా మేలు పొందినవారంతా వైఎస్సార్ సీపీకిఈ ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యురాలు వేమా రోజారమణి, నాయకులు యర్రంశెట్టి బాలయ్య, బడేటి మల్లి, గ్రంధి ఆదిత్య, మాడుగుల సామ్యేలు, శేషం మధుబాబు, ఆంజనేయులు, తంగిరాల సృజినీ కుమార్, ఓర్సు నరసింహారావు, బండారుపల్లి శబరి, ఎం పాండు, శివ, మంగినేని వెంకట్రామయ్య, గుగులోతు శివ నాయక్, దూళ్ల సాయి పాల్గొన్నారు.



కంచికచర్ల వసంతకాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వేమా సురేష్, శంకర్ తదితరులు

సేవ చేయడాన్ని అదృష్టంగా భావించాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తోటి వారికి సేవ, సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ చైర్మన్ నిట్టా రవికిషోర్ అన్నారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో గవర్నరుపేటలోని ఐసీఏఐ భవన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నిట్టా రవికిషోర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అసోసియేషన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం ప్రతి ఏటా వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంటామని చెప్పారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ కార్యదర్శి జయంత్ ఉప్పులూరి పాల్గొన్నారు.

కాలేయ వ్యాధిపై అవగాహన అవసరం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కాలేయ సంబంధిత వ్యాధులు, వాటి నివారణ, చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఎస్.భవనారాయణ సూచించారు. ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలో కాలేయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ భవనారాయణ మాట్లాడుతూ అవగాహన లోపంతో చాలా మంది కాలేయ వ్యాధి బారిన పడుతున్నారని అన్నారు. మానవ శరీరంలో కాలేయం ముఖ్యమైన అవయవం అని, క్రమం తప్పకుండా వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కాలేయ సంబంధిత రుగ్మతల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. అనంతరం నాగార్జున హాస్పిటల్, జైడూస్ లైఫ్ సైన్సెస్ సహకారంతో రైల్వే ఉద్యోగులు, లబ్ధిదారులకు ఉచితంగా హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, ఫైబ్రోస్కాన్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే హాస్పిటల్ ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com